# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 23 ఏప్రిల్, 2026 | పేజీలు : 06




యాదగిరిగుట్టలో..

### తొలి రోజు..తొలి బస్సు నుంచే...

# ఆర్‌టిసిలో సమ్మె..

నల్లగొండ జిల్లాలో డిపోలకే పరిమితమైన బస్సులు

బస్సుల కోసం బస్టాండ్లలో ప్రయాణికుల ఎదురు చూపులు

డిపోల ఎదుట కార్మికుల నిరసనలు

సమ్మెకు మద్దతుగా నల్లగొండలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,సిపిఐ నేతలు సంఘీభావం

సూర్యాపేట, కోదాడ డిపోల నుండి అద్దె బస్సులు మినహా ఒక్క బస్సు రోడ్డు ఎక్కలేదు







**ప్రజాపక్షం/నల్లగొండ :** ఆర్‌టిసి పరిరక్షణతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఆర్‌టిసి జేఏసీ చేపట్టిన సమ్మె మొదటి రోజు విజయవంతంగా సాగింది. తొలి బస్సు నుంచే కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు.నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ,దేవరకొండ, నార్కట్ పల్లి బస్సు డిపోల నుంచి సంస్థకు చెందిన బస్సులతో పాటు అద్దె బస్సులు కూడా రోడ్లపైకి రాకుండా డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రయాణికులు బస్టాండ్లకు చేరుకుని గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూశారు.బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లిస్తూ ప్రయాణం కొనసాగించారు.డిపోల ఎదుట ఆర్‌టిసి కార్మికులు నిరసనలు చేపట్టి,తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మెకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నల్లగొండలో కార్మికులకు సంఘీభావం తెలిపారు. సీపీఐ నాయకులు కూడా సమ్మెలో పాల్గొని ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు పూర్తి మద్దతు ప్రకటించారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి ఉద్యోగులు బుధవారం చేపట్టిన సమ్మె విజయవంతమైంది. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ డిపోల నుండి అద్దె బస్సులు మినహా ఒక్క బస్సు రోడ్డు ఎక్కలేదు. డిపోలకే బస్సులు పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర అవస్తలు పడ్డారు. దీంతో బస్టాండులు ప్రయాణికులు లేక వెలవెలబోయాయి. ఆర్‌టిసి కార్మికులందరూ యూనియన్‌లకు అతీతంగా డిపోల వద్ద బైటాయించి తమ నిరసన తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు తన మ్యానిఫెస్టోలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పిస్తామంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు అయినా ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ప్రైవేటుపరం చేయాలనే కుట్రలో భాగంగా నూతనంగా ప్రైవేటు సంస్థలకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను నడుపుతుందన్నారు. ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఐ, సిపి ఎం, టిఆర్‌పి నాయకులు తమ మద్ధతు ప్రకటించారు.



## ధరిత్రిని, ప్రకృతిని కాపాడాలి

అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవంలో సైకిల్ తొక్కిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా దరిత్రి తోపాటు,ప్రకృతి పెను విపత్తును ఎదుర్కొంటున్నదని,దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాతృ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం సమీపం లోని కేంద్రీయ విద్యాలయ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని కేంద్రీయ విద్యాలయ వద్ద ఆయన జండా ఊపి ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు, మీడియాను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రపంచం పెను ప్రమాదంలో చిక్కుకుందని, దీనివల్ల వాతావరణ, జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు.మానవ తప్పిదాలు, వివాదాల వల్ల మనుషులతో పాటు, జంతుజాలానికి కూడా ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ఈ సైకిల్ ర్యాలీలో డిఎఫ్ఓ రాజశేఖర్,జిల్లా యువజన,క్రీడల అభివృద్ధి శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు,జిల్లా సైన్స్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

**ప్రజాపక్షం/చండూరు:** ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చండూరు అంగడిపేటలో ఎఫ్ఎస్‌సిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అకాల వర్షాలు వడగండ్ల వానల కారణంగా ధాన్యం తడిసి రైతాంగం ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులు 15 రోజులుగా ధాన్యాన్ని పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న అధికారులు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు.వరి ధాన్యం కొనుగోలులో అదనపు తూకం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్,జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు,రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు వెంకటేశ్వర్లు,బండమీది వెంకన్న,మండల పార్టీ కార్యవర్గ సభ్యులు బరిగల వెంకటేష్,దోటి వెంకన్న,జెల్లా శ్రీను పాల్గొన్నారు.



## శ్రీలక్ష్మి నృసింహ స్వామి తిరు కల్యాణోత్సావానికి ఏర్పాట్లు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** శ్రీలక్ష్మి నృసింహ స్వామి దేవస్థానం మట్టపల్లి మహాక్షేత్రం మఠంపల్లి నందు ఈనెల 29 నుండి మే 04 వరకు జరుగు శ్రీస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవముకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్ నందు ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇట్టి కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు వేలాది మంది భక్తులకు ఎటువంటి ఆటంకములు జరగకుండా మిషన్ భగీరథ శాఖ నిరంతరం నీటి సరఫరా చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు, ఒక అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. ఆర్‌టిసి కళ్యాణ మహోత్సవములకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ సరఫరాకు ఆటంకం కలగకుండా నిరంతరం సరఫరా ఉండే విధంగా చూడాలన్నారు. మట్టపల్లి గ్రామ పంచాయితీ దేవాలయ పరిసర ప్రాంతాలు పారిశుద్ధ్యం చేయుటకు, ఫైర్ సర్వీస్ వారిని ఫైర్ ఇంజన్ స్టాండ్ బై చేయాలన్నారు. సాగర్ సిమెంట్, నాగార్జున సిమెంట్ వారి సహకారంతో భక్తులకు స్నాక్స్ అందించాలని సూచించారు. దేవస్థానం వారు క్యూలైన్స్ ఏర్పాటు, పార్కింగ్ స్థలంలో సిసి కెమెరా ఏర్పాటు, వృద్ధులకి, దివ్యాంగులకు ఉచిత ఆటో ఏర్పాటు మొదలగునవి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లి రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి యొక్క సహాయ సహకారాలు సేవా దృక్పథంతో అందించి కళ్యాణ మహోత్సవమును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, అడిషనల్ ఎస్‌పి రవీందర్ రెడ్డి, జడ్‌పి సిఈఓ డి. శిరీష, ఆర్‌డిఓ వి. శ్రీనివాసులు, కె. భాస్కర్, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ కె. భాస్కర్, నల్లగొండ, దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు విజయకుమార్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి. జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పరిధిలో గల సాలార్జింగ్ పేటలో ఇటీవల గ్యాస్ లీకేజీ కారణంగా మంటల్లో తీవ్రంగా గాయపడిన షేక్ నాగుల్‌ను సోసైటీ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి 20వేల రూపాయలతో పాటు దుస్తులు, వంట సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం సోసైటీ కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్‌బాబు లు మాట్లాడుతూ ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ చారిట్రబుల్ సోసైటీ అధ్యక్షురాలు పబ్బా గీత, డైరెక్టర్ తొడుపునూరి మంజుల, కొండూరు మాధవి, వంకాయల స్వాతి, బండారు శ్రీనివాసరావు, వెంపటి ప్రసాద్, గరిణే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పాదరక్షలు పంపిణీ

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి కుమార్తె మహాలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు పాదరక్షలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కార్మికులు వేసవికాలంలో పనిచేసేందుకు వీలుగా వైస్ చైర్మన్ తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా పాదరక్షలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, నూకల సుగుణ, సత్యనారాయణరెడ్డి, యారవ శ్రీనివాస్, నూకల కళ్యాణి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/పాలకవీడు:** బెట్టెతండా ఎత్తిపోతల పథకంతో గిరిజనుల భూములు సస్యశ్యామలం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గిరిజన రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్న బెట్టెతండా సర్పంచ్ మాలోతు బుజ్జి మోతిలాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బెట్టెతండా సమీపంలో మూసినదిపై రూ. 33.84 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.కిషన్, వార్డు సభ్యులు బి.మధునాయక్, ఎం.శ్రీను, ఎం.సుధీర్, నాగేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.

## అన్నదానం

**ప్రజాపక్షం/అనంతగిరి:** తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ హరహరసుత అయ్యప్ప స్వామి సన్నిదిలో గత సంక్రాంతి పండుగ నుండి ప్రారంభమైన ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ 15వ వారం విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. గురువారం అమ్మగూడెం వ్యాస్తవ్యులు ప్రభాకర్ స్వామి, రేణుక దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. పందిరి వీరయ్య, అర్వపల్లి సత్యనారాయణ, జాగిని ప్రసాద్, కొండపల్లి వేణుగోపాలరావు, కొక్కిరేణి రామారావు పాల్గొన్నారు.



# ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న కార్మికులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం ఎప్పటికప్పుడు టిఆర్‌పి పార్టీ ముందుండి పోరాడుతుందని అందుకు తమ సంపూర్ణ మద్ధతు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణమే చర్చలకు ముందుకు వచ్చి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌పి నాయకులు మామిడి అంజయ్య, కొన్నె మంజుల గౌడ్, బొల్లె సైదులు, వల్లాల సైదులు యాదవ్, లింగాల సైదులు, నేలచర్ల మధు ప్రజాపతి, లింగరాజు యాదవ్ పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే తల్లీ బిడ్డ క్షేమం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని అప్పుడే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఓ సుబ్బలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, నాగమణి క్యాటరింగ్స్ అధినేత నకిరేకంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 41వ వార్డు అన్నాదురైనగర్ సెక్టర్ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన పోషన్ పక్వాడ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాసనతో పాటు అంగన్‌వాడీ సెంటర్ నుంచి పాఠశాలకు వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, వార్డు అభివృద్ధి అధికారి శ్వేత, ఆయా నవ్య, వార్డు ప్రముఖులు రమణ పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పివి టీకా తప్పనిసరి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బాలికలకు క్యాన్సర్ రాకుండే ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న హెచ్‌పివి టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని సర్పంచ్ నాతాల వెంకట్రాంరెడ్డి, ఉపసర్పంచ్ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని గాజులమల్కాపురం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పివి టీకా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే వ్యాక్సిన్ ప్రైవేట్



హాస్పటల్‌లో ఒక్కొక్క వ్యాక్సిన్ రూ.3వేల అవుతుందన్నారు. ఈ టీకా ద్వారా గర్భాశయ క్యాన్సర్, గొంతు క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులను ప్రాథమిక దశలోనే అడ్డుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** హైదరాబాద్ జలవిహార్‌లో మే 12న జరిగే తెలంగాణ జన సమితి పార్టీ నాల్గవ రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ ప్లీనర్‌కి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కోదండరాం కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్ ముదిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమ ఆశయాల సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలతో ఏర్పడిన తెలంగాణ జన సమితి పార్టీ ప్లీనరీలో రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు చంద్రకాంత్, పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దు శంకర్, రైతు జనసమితి జిల్లా అధ్యక్షుడు సుమన్ నాయక్, విద్యార్థి జనసమితి అధ్యక్షుడు బొమ్మగాని వినయ్, ఈశ్వర్, నాగు నాయక్, ఫరీద్, లోకేష్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సంఘం సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నారు. బుధవారం పట్టణంలోని అరె కటిక కుల మటన్ విక్రయదారుల, మార్కెటింగ్ సేవల, పరస్పర సహాయ సహకార సంఘం మొదటి వార్షికోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. చిన్న చిన్న విభేధాలను పక్కన పెట్టి అందరూ కలిసి పనిచేస్తేనే సంఘం మరింత బలోపేతమవుతుందన్నారు. సంఘం కొరకు ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్ళి పరిష్కారం చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోయిల్‌కార్



నాగయ్య, జమాల్‌పూరి బాలిశ్వర్, సింకార్ చంద్రం, జమాల్‌పూరి నరేష్, టింగిల్‌కార్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**ప్రజాపక్షం/మునగాల:** మహానీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను నేటి సమాజానికి ఆదర్శప్రాయంగా ఉండాలని గ్రామస్తులు తెలిపారు. మునగాల మండల పరిధిలోని సీతానగరంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలన చేశారు. గ్రామంలో ఉన్న యువత ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రచించి హక్కుల్ని కల్పించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రామంలో ఏరాపటు చేయడం సంతోషకరమని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లు ప్రసాదరావు, కొల్లు నాగేశ్వరరావు, లెక్కల సుధాకర్, పల్లపు శ్రీనివాస్, అంబేద్కర్ యూత్ మాజీ అధ్యక్షుల పడిశాల నాగరాజు, పుల్లూరి సింహాద్రి, పుల్లూరి శివాజీ పాల్గొన్నారు.

## మంగ్లీపై అసత్య అరోపణలను ఖండిస్తున్నాం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రముఖ గాయని మంగ్లీపై ఆసత్య ఆరోఫణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ గిరిజన శక్తి నగర్ అధ్యక్షులు గుగులోతు అంజినాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ గాయని మంగ్లీపై సంభందంలేని కేసులలో ఇరికించడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఆమె పరువు, ప్రతిష్టలను భంగపరిచేటువంటి కుట్రని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆమె ఎక్కువ ప్రజలను అధిక వడ్డీ ఆశచూపిస్తూ కోట్లాది రూపాయలు వసూలు చేసిన సూత్రదారులైన రమావత్ మధు, హేమకాంత్‌రెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

## రామానుజచార్యుల జయంతి



**ప్రజాపక్షం/మునగాల:** శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో ఉన్న శ్రీ రామానుజచార్యుల స్వయంభు విగ్రహనికి, దేవాలయంలో బొడ్డు మండపంపై ఆలయ ప్రధాన అర్చకులు శ్రీముదుంబై శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలోని శ్రీకొదండరామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ముదుంబై శేషాచార్యులు, ముదుంబై లవకుశచార్యులు, వీరబోయిన వీనోద్, భారి లక్ష్మయ్య, వీరబోయిన వెంకన్న, కొంద్రు గోపినాథ్, గంగూరి సంతోష్‌కుమార్, కనపర్తి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

## డిజిటల్ అలవాట్లను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పిల్లల్లో స్క్రీన్ టైమ్‌ను తగ్గించి డిజిటల్ అలవాట్లను ప్రోత్సహించేందుకు పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సిపిడివో లిఖిత తెలిపారు. బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని అంగన్‌వాడీ 7వ కేంద్రంలో ఏడవ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు సమాజం పాత్ర అనే అంశంపై అవగహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీలో కౌన్సిలింగ్ సెషన్స్ నిర్వహించి, అధిక స్క్రీన్ వినియోగం వల్ల కలిగే మానసిక, శారీరక సమస్యలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ సూపర్‌వైజర్ సోమమ్మ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రాజేష్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, బెన్సిషరిస్ పాల్గొన్నారు.





## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా బాలికలకు టీకా పంపిణీ జరుగుతుందని సర్పంచ్ పోనుగోటి నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని చెట్లముకుందాపురం గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పివి టీకా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఉషశ్రీ, ఇందిరా, సునీత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల తహాశీల్దార్ బి. శ్రీకాంత్ కోరారు. బుధవారం మండలంలోని బొల్లంపల్లి, నాణ్యతండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారీలను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వం అందించే మద్ధతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రాంబాబు, సిసి నాగార్జున, సర్పంచులు అంకిరెడ్డి వీరాంజనేయులు, కేలోతు కాంతమ్మ హరిలాల్ నాయక్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ గడ్డి అందజేత



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన వీరమల్లు రాకేష్ శ్రీ మట్టపల్లి రాజ్యలక్షి చెంచులక్ష్మి సమేత నర్సింహాస్వామి దేవాలయంకు చెందిన గోశాలకు ట్రాక్టర్‌ను గడ్డిని జూలకంటి నరేష్ గురుస్వామి ఆధ్వర్యంలో దానంగా అందజేశారు. స్వామి వారి కృఫ కటాక్షలతోనే దానం చేసినట్లు దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల వెంకటేశ్వర్లు, బాల్తు రామనాధం, నక్క సైదులు, పొలంపల్లి సైదులు, ఆవుల నాగయ్య, చామకూరి మహేష్, సోమగాని వెంకన్న పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** అకాల వర్షంతో కోతకు వచ్చిన వరి పంటను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో అకాల వర్షంతో నెలకొరిగిన పంట పొలాలను, దెబ్బతిన్న పంటను ఆయన సర్పంచ్ రమావత్ తులసిరామ్‌నాయక్, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేలు నష్టపరిహారంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో నష్టపోయిన రైతులను బిఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని గుర్తు చేశారు. రైతులకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని అన్నారు.

## పౌష్టికాహారం లోపాన్ని నివారణకు పోషణ పక్వాడ



**ప్రజాపక్షం/త్రిపురారం:** గర్భిణీలు,బాలింతలు చిన్న పిల్లల్లో పౌష్టికాహారం లోపాన్ని నివారించేందుకే పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించినట్లు సిడిపిఓ చంద్రకళ అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం 15 రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. అంగన్వాడీలలో ప్రీస్కూల్ పిల్లల సంఖ్య పెంచాలన్నారు.తల్లులకు పోషకాహారం విలువలపై అవగాహన కల్పించాలని సూచించారు.చిన్నారులకు పాఠశాలల పట్ల ఆసక్తి పెంచేందుకు అంగన్వాడీలు రోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ కుమారి,ఎంఈఓ రవి నాయక్,డాక్టర్ వనిత,కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి,త్రిపురారం సర్పంచ్ బైరం లక్ష్మికృష్ణ, ఉప సర్పంచ్ అనుముల నాగమణి,మండల అంగన్వాడీలసూపర్వైజర్ లు మల్లేశ్వరి,వెంకటమ్మ,విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో ఈ నెల 29, 30, మే 01 మూడు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్న ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని అధికారులతో పాటు గ్రామస్తులను చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాట్లపై అధికారులూ అఖిలపక్ష నాయకులు దేవాలయం కమిటీ సభ్యులు గ్రామస్తులతో సమీక్షా సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ రాష్ట్ర జాతరలో అమ్మవారిని పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పలు ప్రజా ప్రతినిధులు భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకోనున్నారు. కాబట్టి అన్ని ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.దేవాలయానికి, ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అసౌకర్యాలకు తావు లేకుండా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదని గుర్తుచేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ అధికారి, ఎండీఓ భాస్కర్, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, ఎంవో శ్రీవాణి, ఎస్సై భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్‌పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం




**ప్రజాపక్షం/డిండి;** డిండి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు గ్రామ సర్పంచ్ నల్లగంతుల రవి తెలిపారు. డిండి ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఫేర్వేల్ డే సెలబ్రేషన్స్‌లో ముఖ్య అతిథిగా సర్పంచ్ పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల 205 మంది విద్యార్థులతో కళకళలాడుతుందని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు చక్కగా విద్యా భోదన చేస్తున్నారని 5 సంవత్సరాలు పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్ళి చక్కగా చదువుకొని ఉన్నత చదువులు చదవాలని ఆయన సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గీతాంజలి, హైస్కూల్ సినియర్ ఉపాధ్యాయులు తిరుపతయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సిద్ధ రామేశ్వర స్వామి ఆశీస్సులు పొందిన ఆలకుంట్ల దంపతులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** శ్రీ జగద్గురు ఇమ్మడి సిద్ధ రామేశ్వర స్వామి కార్పొరేటర్ ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు నివాసానికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా స్వామివారికి సంప్రదాయబద్ధంగా పుష్పాభిషేకం చేసి ఘన స్వాగతం పలికారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈకార్యక్రమంలో కుటుంబ సభ్యులు,అభిమానులు,స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.కార్పొరేటర్ ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు దంపతులు స్వామివారిని సత్కరించి తమ గృహానికి విచ్చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్వామివారు కుటుంబ సభ్యులకు శుభాశీస్సులు అందజేసి,సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని ఆశీర్వదించారు.కార్యక్రమం భక్తి, భవ్యతల నడుమ ఘనంగా నిర్వహించబడింది.



## సమ్మె విరమించి విధుల్లో చేరాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** సమ్మె విరమించి గ్రామ పంచాయతీ కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. కార్మికులకు 3 నెలల జీతాలను అకౌంట్‌లలో జమ చేశామని సాంకేతిక సమస్య వలన ప్రభుత్వం నుండి అప్రువల్ రాకపోవడం వలన జీతాలు ఆగాయని తెలిపారు. కార్మికుల పట్ల తమకు ఎలాంటి వివక్షత లేదని సాంకేతికత కారణాల వల్లనే జాప్యం జరిగిందని ఇక ముందు ప్రతి నెల సకాలంలో వారికి జీతాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. వేసవి కాలం దృష్ట్యా కార్మికులు సమ్మె వెంటనే విరమించి విధుల్లోకి చేరి సహకరించాలని కోరారు. ఉప సర్పంచ్ కొడిదాల పద్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## కార్మికుల వేతనాలు చెల్లించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** పెండింగ్‌లో ఉన్న 5నెలల జీతాలను గ్రామ పంచాయతీ కార్మికులకు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని కోరారు. 5 నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతూ వారు బుధవారం గ్రామంలోని చౌరస్తా వద్ద సమ్మె చేశారు. ఈ సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు, సిపిఐ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. బకాయిలను వెంటనే చెల్లించి గ్రామ పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని రామస్వామి కోరారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ గౌరవ అధ్యక్షుడు ఎండి మోహినోద్దిన్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోమ్లానాయక్, కల్లు చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఎర్త్‌డే ధరిత్రి దినోత్సవం




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం దరిత్రి దినోత్సవం (ఎర్త్‌డే) కార్యక్రమాన్ని పాఠశాల యంగ్ ఎర్త్ లీడర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం జీవశాస్త్ర ఉపాధ్యాయులు శౌరి, జానకిరాములు మాట్లాడుతూ ఆడవుల విస్తీర్ణత పెరిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్‌ఖాన్, వెంకటేశ్వరరావు, నర్సింహరావు, అన్నపూర్ణ, మాధవి, వెంకటరెడ్డి, నాగమణి, అశ్రోన్, భానుమతి, యాదగిరి, రామ్మూర్తి, బాలు, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

## నిత్య కల్యాణోత్సవం



**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. సుప్ర భాతసేవ, శ్రీ మహా లక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మండ నాయకుడి అన్నప్రసాద వితరణలో సుమా రు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## హైకోర్టు తీర్పు చెంపపెట్టు

**ప్రజాపక్షం/యాదాద్రి :** మేడిగడ్డ కుంగుబాటు వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లి రాజకీయ లబ్ధి పొందాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు హైకోర్టు తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని బీఆర్ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పును తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన ప్రకటించారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రాథమిక హక్కులను, సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కడమే కాకుండా, కనీస విచారణ లేకుండా ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక చెల్లదని న్యాయస్థానం స్పష్టం చేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు అని రామచంద్రారెడ్డి అభివర్ణించారు.



## మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బీర్ల శంకర్ ఆధ్వర్యంలో స్థానికులకు యత్రికులకు , ఆటో డ్రైవర్స్‌కి బటర్ మిల్క్ పంపిణి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ ప్రభావం ఎక్కువ ఉన్న సందర్బంగా ప్రజల ఆరోగ్య దృష్టిలో ఉంచుకుని ప్రజలు సేవ చెయ్యాలి అని ఈ కార్యక్రమం నిర్వహించారు.

## ప్రధాని నరేంద్ర మోదీని ఉగ్రవాది అనడం సిగ్గుచేటు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** నిన్న తమిళనాడులో జరిగిన ఎన్నికల సభలో దేశ ప్రధాని నరేంద్ర మోదీని ఉగ్రవాది అని అనడం సిగ్గుచేటు అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ అన్నారు. బుధవారం భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం జరిగింది. పట్టణ కౌన్సిలర్ వంగేటి సూచిరిత, జెర్రిపోతుల స్వర్ణలత , తుమ్మల యాస్మిన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమీషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని మాజీ ఎంపిపి గుండగాని కవితా రాములు గౌడ్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కమీషన్ ఇచ్చిన నివేదిక అంతా ట్రాష్ అని చెత్తబుట్టలో వేయాల్సిందేనన్నారు. కమీషన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బతీయాలనే రేవంత్ ప్రభుత్వ కుట్రలను హైకోర్టు తీర్పు తిప్పికొట్టిందన్నారు. కేసిఆర్ పేరు తుడిచేయాలనే దురుద్ధేశంతో కాళేశ్వరం కాదు కూలేశ్వరం అని ప్రచారం చేసి మేడిగడ్డ పిల్లర్ను రిపేర్ చేయకుండా ప్రజలను మభ్యపెట్టారని ఇప్పటికైనా సరిచేయాలని డిమాండ్ చేశారు.

## బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలో బుధవారం ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలో గల మౌలిక వసతులను వివరించారు. ప్రధా నోపాధ్యాయురాలు పునర్వసు, రజిని, గ్రామ సర్పంచ్ వినోద్‌కుమార్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



# లారీల సమస్య పరిష్కరిస్తాం, కాంటాలు ఆపొద్దు



**ప్రజాపక్షం/నిడమనూరు:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను ఆపొద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దిగుమతి కోసం ఉన్న లారీల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిఆర్‌డిఓ వై శేఖర్ రెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.బుధవారం మండల పరిధి ఊట్కూర్,మారుపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అన్ని వసతులు కల్పించాలని కాంటాలను పెట్టకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని సీరియల్ బుక్ ఆధారంగా కాంటాలు పెట్టాలని వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి సీరియల్ తప్పిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులను హెచ్చరించారు ఈ సందర్భంగా సీరియల్ బుక్కును పరిశీలించారు లారీలు హమాలీల కొరతను రైతులు నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకు పోయారు.బిహారి హమాలీలతో మాట్లాడి కాంటాలు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.అనంతరం ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన ఉపాధి హామీ నర్సరీలను పరిశీలించారు,ఆయన వెంట ఏపిఎం నరహరి,సిసి సైదులు,ఏఈఓ మహేష్, ఉపాధి హామీ టిఏ,ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

# బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న ప్రభుత్వాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు దక్కాల్సిన ఏ ఒక్క హామీలను, రాజకీయ పదవులు, రిజర్వేషన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్స్, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అన్యాయం, సర్పంచ్, కౌన్సిలర్ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేస్తూ ఎన్నికల సమయంలో మాత్రం బీసీలపై కపట ప్రేమ, దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కుతున్న పార్టీలకు వ్యతిరేకంగా బీసీలందరు ఉమ్మడిగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందడంలో పూర్తి స్థాయిలో వెనుకంజలో ఉన్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా బీసీల ఓట్లు కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు బీసీలను అణచివేత ధోరణి మానుకోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జక్క నాగేశ్వర్‌రావు, రవీందర్‌గౌడ్, రమేష్ యాదవ్, ఉదయ్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈ నెల 22వ తేదీన నల్లగొండ పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్లో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ హృదయ్ కుమార్ రెడ్డి,రెవరెండ్ బ్రదర్ సెబాస్టియన్ చేతుల మీదుగా ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ వేసవి కరాటే శిక్షణ శిబిరం ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులు,యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శారీరక దృఢత్వం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.బ్లాక్ బెల్ట్ 7వ డాన్,ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఇండియా సీనియర్ ఎగ్జామినర్ నాంపల్లి కనకారావు మాట్లాడుతూ వేసవి కరాటే శిక్షణ శిబిరం ద్వారా క్రమశిక్షణ,ధైర్యం,ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.అందరూ ఈ శిబిరంలో పాల్గొని ప్రయోజనం పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీఈటీ టీచర్లు జి.జయంత్ కుమార్, బి.అంబ్రోస్, ఎం.లక్ష్మి, ఎం.రాజు,సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ కట్ట అయోధ్య రాములు,సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే షావోలిన్ షోటోఖాన్ కూడా హాజరయ్యారు.

# ఎండతో ఎగిసిపడుతున్న ఉదయం...

### మబ్బులతో చల్లబడుతున్న సాయంత్రం...



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ పరిధిలో వాతావరణ పరిస్థితులు రోజురోజుకీ విభిన్నంగా మారుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత భగభగలాడుతూ ఉండటంతో కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అధిక వేడి కారణంగా దగ్గు,శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు.మధ్యాహ్న వేళల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడంతో బయటకు రావడమే కష్టంగా మారింది.రోడ్లపై రద్దీ కూడా తగ్గిపోతుండగా,చాలా మంది ఇంటి బయటకు రావడానికి భయపడుతున్నారు.అయితే సాయంత్రం సమయంలో వాతావరణంలో అనూహ్య మార్పు కనిపిస్తూ కారు మబ్బులు కమ్ముకోవడంతో కొంత ఉపశమనం లభిస్తోంది. చల్లని గాలులతో కాలనీల్లో ప్రజలు బయటకు వచ్చి కాస్త సేదతీరుతున్నారు.వాతావరణంలో ఈ ఆకస్మిక మార్పుల కారణంగా ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,ముఖ్యంగా పిల్లలు,వృద్ధులు అవసరంలేకుండా ఎండలో బయటకు వెళ్లకుండా ఉండాలని సూచిస్తున్నారు.



## వైద్యులు సమయ పాలన పాటించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న చికిత్స, మందుల పంపిణి, ఆహారం పట్ల ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మీడియా సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని,ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడంలో మీడియా మిత్రులు ముందుండాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మీడియా సభ్యులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అనంతరం శాంతలక్ష్మి ఫౌండషన్ కంబాలపల్లి ఉపేందర్, మన్నెం యాదగిరిల సహకారంతో రోడ్డు భద్రతను ప్రోత్సహించే భాగంగా జిల్లా ఎస్పిచేతుల మీదుగా మీడియా సభ్యులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి, ఎస్‌బి సీఐ రాము,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య,ఉమెన్స్ పోలిస్ స్టేషన్ సీఐ కరుణాకర్,ఇతర పోలీస్ అధికారులు,మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని గుంటూరు బ్రదర్స్ చంద్రశేఖర్, రామ్మోహన్‌లు అన్నారు. బుధవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం, బంగారుగడ్డ ప్రాథమిక పాఠశాలలోని సుమారు 200 స్టీల్ వాటర్ బాటిల్స్‌ను విద్యార్థులకు అందించి వారు మాట్లాడారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిల్స్‌లో కాకుండా స్టీల్ బాటిల్స్‌లో నీటిని తాగాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణాన్ని రక్షించేందుకు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, అరుణ, సుజాత, కోటేశ్వరి, గజ్జి శ్రవణ్‌కుమార్, శ్రీదేవి, సాయిశ్రీ, శ్రీహర్ష, వకుల, లక్ష్మీ నారాయణ, ఇందిరా, గీత, ఆదిలక్ష్మి , వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## గోపాల మిత్రల జిల్లా అధ్యక్షుడిగా గోవింద్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలషాపురం గ్రామానికి చెందిన వంగూరి గోవింద్ గోపాల బుధవారం మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కమిటి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల మిత్రలకు సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని, గోపాల మిత్రల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# నేడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కమీషన్ అసోసియేషన్, ట్రేడర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోరిక మేరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎగుమతుల దృష్ట్యా నేడు (గురువారం) వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఫసీయుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు తిరిగి గురువారం రాత్రి 12 గంటల తరువాత రైతులు తెచ్చిన ధాన్యాన్ని లోనికి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

# వడదెబ్బతో రోజువారి కూలీ మృతి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మయ్య (47) బుధవారం వడదెబ్బతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే లక్ష్మయ్య కూలీ పనులకు వెళ్లగా వడదెబ్బకు గురై మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మయ్య రోజువారి కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.

# 57వ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/కోదాడ: భారత కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజానికి, నయా రివిజనిజానికి వ్యతిరేకంగా పార్లమెంటరీ పంథాను తిరస్కరిస్తూ దున్నే వానికి భూమి అనే నినాదంతో 1969లో విప్లవకారుల నాయకత్వంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వక్కంతుల నర్సింహారావు అన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి ఉదయగిరి, రైతు కూలి సంఘం నాయకులు అలీ పాల్గొన్నారు.



ప్రజాపక్షం/గరిడేపల్లి: పోరాటాలతోనే సమాజంలో దోపిడి వ్యవస్థ అంతమవుతుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, మేకల కనకారావు అన్నారు. బుధవారం మండలంలోని వెలిదండ గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని ఎద్దేవా చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపారు. మొదట పార్టీ పతాకాన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు మేకల కనకరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కామళ్ల నవీన్, గుండు నగేష్, చెనగాని సాంబయ్య, అంజయ్య, పోటు శ్రీహరి, సిహెచ్ లక్ష్మయ్య, ముత్తయ్య, కోటయ్య పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తా

నారపరాజు శ్రీనివాసరావు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: తమపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో తనను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలిపించిన న్యాయవాదులకు రుణపడి ఉంటానని వారి సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారపరాజు శ్రీనివాసరావు అన్నారు. నేడు హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా బుధవారం కోర్టు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగిల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు గా ఉన్న హుజూర్‌నగర్‌కు ఇప్పటికే అదనంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జిల్లా జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరి చేయించడంలో అప్పటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రామిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహాయ సహకారాలతో ఎంతో అభివృద్ధి పరిచారని తద్వారా ఇక్కడ న్యాయవాదులకు వృత్తిపరమైన పని దొరుకుతుందని ఆయన వివరించారు. అలాగే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహాయ సహకారాలతో సాముల రామిరెడ్డి మరో రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను కూడా మంజూరి చేయించారని వారిద్దరి ఆశీస్సులతో వాటిని ప్రారంభించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. శిధిలావస్థలో ఉండి కూలిపోయిన పాత కోర్టు భవనం స్థానంలో రూ.3కోట్ల 30 లక్షల రూపాయలతో ఆధునాతనమైన కోర్టు భవనాన్ని నిర్మించిన ఘనత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సాముల రామిరెడ్డిలకే దక్కిందన్నారు. అంతే కాకుండా 8 కోర్టులకు సరిపోను న్యాయస్థాన భవన సముదాయం, న్యాయమూర్తుల నివాస సముదాయాల కోసం మరో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడం సంతోషదాయకమన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి హామీలతో వడ్డేరుల్లో నూతన ఆశలు నింపాయి

జిల్లా అధ్యక్షులు వేముల,పిఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన అఖిల భారత వడ్డేర సంక్షేమ సంఘం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్,పిఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అఖిల భారత వడ్డేర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ సూచన మేరకు,రాష్ట్ర అధ్యక్షులు మంజుల రమేష్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ముఖ్య నాయకుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,శ్రీశ్రీశ్రీ జగద్గురు సిద్ధరామేశ్వర స్వామి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సభకు హాజరైన రాష్ట్ర, జిల్లా స్థాయి వడ్డేర ప్రజాప్రతినిధులకు,అలాగే జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విచ్చేసిన వడ్డేర సోదరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో సంక్షేమ సంఘం నాయకులు జి.వి.నారాయణ,యాదాద్రి జిల్లా అధ్యక్షులు గుర్రం కుమార్ స్వామి,రాష్ట్ర నాయకులు వంటిపులి శ్రీనివాస్,గంజి నర్సింగ,పల్లపు దుర్గయ్య,ఆలకుంట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

# వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహణ



ప్రజాపక్షం/చండూరు : ఎంపీపీ యూపీఎస్ కొండాపురం గ్రామంలో 7వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.పాఠశాలను విడిచి హైస్కూల్‌కు వెళ్లనున్న విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూతం ముత్యాలు మాట్లాడుతూ విద్యార్థులు హైస్కూల్‌లో కూడా క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ పాఠశాలలో నేర్చుకున్న విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని చెప్పారు.అనంతరం విద్యార్థులకు పెన్నులను బహూకరించారు.ఉపాధ్యాయులు జె.పావని విద్యార్థులకు ప్యాడ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ.భద్రయ్య,వి.భగవంత్ రెడ్డి,గ్రామ కార్యదర్శి రమేష్,పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:ఇటీవల వెలువడిన స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(సెట్),నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) తెలుగు విభాగంలో ఉత్తీర్ణులైన నాగార్జున ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థులు బరిగెల శ్రవణ్ కుమార్,కందుల ఏడుకొండలను బుధవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్,తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్ విద్యార్థులను అభినందిస్తూ,వారి కృషి,పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు నిరంతర శ్రమ, క్రమశిక్షణ ఎంతో అవసరమని సూచించారు.సెట్,నెట్‌వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షల్లో విజయం సాధించడం గర్వకారణమని,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.ప్రభాకర్,దాసరి లింగస్వామి,అంజయ్య,శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# హైకోర్టు తీర్పుతో ప్రభుత్వ కుట్రలు భగ్నం

ప్రజాపక్షం/నకిరేకల్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలను హైకోర్టు భగ్నం చేసిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక సువర్ణ ఫంక్షన్ హాల్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఏకపక్షంగా సాగిందన్నారు. సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకపోవడం,వారి వాదనలు వినకపోవడం వంటి లోపాల వల్ల ఆ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోవడం కుదరదని కోర్టు తేల్చిచెప్పిందన్నారు.ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి ఎదురు దెబ్బ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలోమున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,మాజీ జెడ్పిటిసి తరాల బలరాం,బిఆర్‌ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్ రావు పాల్గొన్నారు.

# మంచి పౌరులుగా ఎదగాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి సమాజానికి మంచి పౌరులుగా ఎదగాలని రామగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,సంజయ్ గాంధీ నగర్ రామగిరిలో విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా పాఠశాల ఆవరణ ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఈ వేడుకను స్మరణీయంగా మార్చారు. ఈ ఫేర్‌వెల్ కార్యక్రమం విద్యార్థుల జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

# తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



ప్రజాపక్షం/మోతె : పేద మహిళ, ఒంటరి మహిళనైన తనను అవమానకరంగా కథలు పడుతున్నావా అంటూ నానా దుర్భాషలాడిన తహశీల్దార్ యం. వెంకన్నపై అట్రాసిటి కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ మోతె మండల కేంద్రానికి చెందిన చెరుకుపల్లి ఉపేంద్ర బుధవారం మండల ఎస్ఐ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో డబుల్‌బెడ్ రూంలోని ప్రభుత్వ జాగాలలో సుమారు 20 కుటుంబాలకు చెందిన వారు ఇండ్లు నిర్మాణం చేసుకున్నారని వారితోపాటు నేను కూడా ఒక్క రూమ్ నిర్మాణం చేసుకోవడం జరిగిందన్నారు. విచారణ కోసం వచ్చిన తహశీల్దార్ నన్ను వివరాలు అడుగగా చాలా నెమ్మదిగా ఎలాంటి బూతులు లేకుండా సమాధానం చెప్పిన నోటికి వచ్చినట్లు పది మందిలో కథలు పడుతున్నావా అంటూ తహశీల్దార్ మూడు సార్లు అనటంతో నా ఆత్మగౌరవం దెబ్బతీశారని తెలిపారు.

# నీటి సరఫరా పునరుద్ధరణ



ప్రజాపక్షం/నకిరేకల్ :మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో పాడైన పబ్లిక్ వాటర్ సప్లై మోటార్‌ను తొలగించి మున్సిపల్ వైస్‌చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్,కౌన్సిలర్ వంటెపాక శ్రీకాంత్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న,వాటర్ సప్లై సిబ్బంది సురేష్, అరవింద్,సైదులు, సతీష్,కలీల్, షర్ఫుద్దీన్,జానీ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండలం లోని శేరిపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లిని రవీంద్రకుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** : వామలీ కార్మికుల సంక్షేమం కోసం వెంటనే వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వంటెపాక వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం నకిరేకల్‌లో రైస్ మిల్ ఆమలీ కార్మికుల సమావేశం, సర్వే నిర్వహించారు. ఈకార్యక్రమంలో తడువాయి రాములు, సూరరపు వీరయ్య, మల్సూర్, బొల్లేపల్లి కృష్ణ, బతుక సైదులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పోష్టికాహారంపై అవగాహన

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం తేల్దేవరపల్లి సెక్టార్ పరిధిలోని ముర్పునూతల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పోషకాలు కలిగిన గుడ్లు, పాలు, పండ్లు, ఆకు కూరలను అధిక మోతాదులో తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్య నుండి బయటపడవచ్చని సూచించారు. అనంతరం చిన్నారులకు అసెస్మెంట్ కార్డులను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



# ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలి

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం**

**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రకృతిని కాపాడుకోవడం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదని,ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా బుధవారం నకిరేకల్ పట్టణంలో అటవీ శాఖ, మున్సిపాలిటీ,పర్యావరణ పరిరక్షణ వేదిక,జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా అవి వృక్షాలుగా పెరిగే వరకు సంరక్షించాలని సూచించారు.నకిరేకల్‌ను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్,కమిషనర్ రంజిత్ కుమార్, అటవీ శాఖ డివిజనల్ అధికారి వై శ్రీనివాస్,రేంజ్ అధికారి గౌతమ్,జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు విద్యాసాగర్,పర్యావరణ వేదిక సభ్యులు, శ్రీనివాస్,నాయకులు గాజుల సుకన్య స్వామి, మురారి శెట్టి కృష్ణమూర్తి,లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి,విజయ్ వంటేపాక నగేష్ పాల్గొన్నారు.




# ఉత్సాహంగా కొనసాగుతున్న సంక్షేమ వారోత్సవాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతుండగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలు,విద్యార్థినులకు అందుతున్న వసతులను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్వయంగా పరిశీలించారు.బుధవారం పట్టణం రాంనగర్‌లోని పాత మోనా కాలేజీ ప్రాంగణంలో ఉన్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల,కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు.అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. సివిల్ సర్వీసెస్ సాధించాలనే ఆశయంతో ఉన్న విద్యార్థినులను ప్రోత్సహిస్తూ, వారికి అవసరమైన స్టడీ మెటీరియల్,పుస్తకాలను జిల్లా యంత్రాంగం తరపున అందిస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, మైనారిటీ రెసిడెన్షియల్ ఆర్‌సిఓ శ్రీకాంత్,పాఠశాల ప్రిన్సిపాల్ షాహీన్ షేక్,ఉపాధ్యాయులు ,విద్యార్థినులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ కళాశాలలు ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థినులు ఉన్నత విద్యలో ముందుకు సాగేందుకు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, చర్లపల్లి 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కళాశాలలో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పవిత్రవాణి కర్న,ఉప ప్రిన్సిపాల్ నీలిమా రెడ్డి,ప్రవేశాల కమిటీ సభ్యులు అపర్ణ,డాక్టర్ ఏ.అన్నపూర్ణ, కళాశాల అధ్యాపకులు ప్రవేశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తాజ్ మహల్ ఎగ్జిబిషన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణం,పరిసర ప్రాంతాల ప్రజలకు వేసవికాలంలో ఆహ్లాదం,వినోదాన్ని అందించేందుకు స్థానిక నాగార్జున కళాశాలలో ఏర్పాటు చేసిన తాజ్ మహల్ ఫన్ అండ్ ఎంజాయ్ ఎగ్జిబిషన్ అభినందనీయమని నల్లగొండ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ అన్నారు.సోమవారం రాత్రి స్థానిక నాగార్జున కళాశాలలో ఫిరోజ్, అంకిత్ గుప్తా, రఫీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాజ్ మహల్ ఎగ్జిబిషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వినోదం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా నల్లగొండలోనే ప్రజలు కుటుంబ సమేతంగా ఎగ్జిబిషన్‌ను సందర్శించి ఆనందించవచ్చని తెలిపారు.నిర్వాహకులు మాట్లాడుతూ ఈఎగ్జిబిషన్‌లో పిల్లల కోసం మేరీ కొలంబస్,వాటర్ బోటింగ్, మోటార్ బైక్స్,ధూమ్ బైక్స్,మహారాజా ట్రైన్,రివాల్వింగ్ టవర్‌తో పాటు బ్రేక్ డాన్స్ వంటి అనేక వినోద కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అలాగే మహిళల కోసం బెంగాలీ కాటన్ చీరలు,పూలు,ఆభరణాలు, కాస్మెటిక్స్‌తో పాటు అనేక రకాల తినుబండారాలు సరసమైన ధరలకు లభిస్తాయని చెప్పారు.పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు మామిడి క్రాంతికుమార్,మహమ్మద్ మహబూబ్ అలీ కౌసర్,కయూమ్ బేగ్ పాల్గొన్నారు.



# పోషకాహారం తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తక్కువ ఖర్చుతో లభించే పోషకాహార విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ, ఈసీసీఈడే, గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్నాలకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ బంటు శ్రీను, సీడీపీవో మమత, సూపర్‌వైజర్లు నాగమణి పాల్గొన్నారు.

## తల్లి, బిడ్డల ఎదుగుదలే అంగన్‌వాడీల లక్ష్యం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషన పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం పునర్వసు, సరళ, సర్పంచ్ వినోద్, దయాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, స్వప్న, ఉప్పలమ్మ, గర్భిణిలు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను సెల్‌ఫోన్ కు దూరంగా ఉంచాలి



**ప్రజాపక్షం/నకిరేకల్:** చిన్నారుల దృష్టిని సెల్‌ఫోన్‌ల నుంచి మళ్లించి శారీరక క్రీడలు,పుస్తక పఠనం వంటి అలవాట్లను పెంపొందించడం అవసరమని ఐసిడిఎస్ సిడిపిఓ ఆశ్ర అంజుమ్ పేర్కొన్నారు.బుధవారం మండలంలోని వల్లభాపురం, నడిగూడెం గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని,పోషణ్ అభియాన్ అధికారి ప్రేమ్ కుమార్, అంగన్వాడీ టీచర్లు తండ పద్మ,అల్లం పద్మ,ఆయా పి. పూలమ్మ పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సర్పంచ్ కేశగాని సరిత లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ప్రమీల, పిల్లల తల్లులు, పద్మ, సావిత్రమ్మ, శిరిష, నాగేంద్రమ్మ, ఉష పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం

**ప్రజాపక్షం/నడిగూడెం:** గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంను తప్పని సరిగా తీసుకోవాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని బృందావనపురం గ్రామంలో పోషణ్ పక్వాడ గ్రాడ్యుయేషన్ డేను అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాలపురం సర్పంచ్ వేల్పుర సోమయ్య, ఉపసర్పంచ్ సంపత్, వీరాబాబు, పల్లె దవాఖాన డాక్టర్ హరినాథ్, ప్రధానోపాధ్యాయులు చంద్రారెడ్డి, రాధా పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



**ప్రజాపక్షం/చింతలపాలెం :** అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ఉపసర్పంచ్ మేడిశెట్టి నరసింహారావు, గ్రామ కార్యదర్శి అనిత ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్త అరెస్ట్

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** భార్యను తీవ్ర మానసిక వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మ హత్యకు కారణమైన భర్త పెరుమాళ్ల రవితేజ ను బుధవారం నల్లగొండ పట్టణంలోని ఆర్‌టిసి బస్ స్టాండ్ వద్ద టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు.ఈ సందర్భంగా టూటౌన్ ఎస్ఐ వై సైదులు మాట్లాడుతూ మునుగోడు మండలములోని సింగారం గ్రామానికి చెందిన గుంటుక సత్తయ్య చిన్న కూతురు అయిన శ్వేత,కు 2022లో నకిరేకల్ మండలములోని మంగలపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ల రవితేజతో వివాహము జరిపించడం జరిగిందని తెలిపారు. వారికి ఒక కూతురు,కుమారుడు సంతానము కలరని గత కొద్ది రోజుల నుండి శ్వేత భర్త అయిన పెరుమాళ్ల రవితేజ త్రాగుడుకు అలవాటు పడి భార్యను మానసికంగా వేదిస్తుండగా ఆమె అతని వేధింపులు తట్టుకోలేక ఈనెల 14న నల్లగొండకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎలుకల మందు త్రాగి అపస్మారక స్థితిలో వుండగా ఆమెను చికిత్స గురించి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ఆ తర్వాత మెరుగైన చికిత్స గురించి హైదరాబాద్ లోని పవన్ సాయి హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుచూ 17 న మృతి చెందిందని తెలిపారు.మృతురాలి అన్న అయిన గుంటుక శాంతి కుమార్ టూటౌన్ పోలీసు స్టేషన్ లో ఇచ్చిన పిర్యాదు మేరకు మృతురాలి భర్త అయిన పెరుమాళ్ల రవితేజను అరెస్టు చేసి కేసు నమోదు చేసి అతన్ని గౌరవ కోర్టుకు రిమాండ్ నిమిత్తము పంపించడం జరుగుతుందని తెలిపారు.




# పెరుగన్నం పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వేసవికాలంలో పట్టణానికి వచ్చే ప్రజలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో అందచేస్తున్న పెరుగన్నం పంపిణి కార్యక్రమం బుధవారం 9వ రోజుకు చేరుకుంది. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్, ఏరియా ఆసుపత్రిలో పేదలకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి సబ్ కలెక్టర్ నారాణ్అమిత్, యువ నాయకులు బత్తుల సాయిప్రసన్నలు పెరుగన్నం అందించి మాట్లాడారు. జూన్ 2వరకు కొనసాగుతుందన్నారు.

